# అనుకోని అతిథులు

మృదులా ఆనంద్‌లు కొత్తదంపతులు.

ఆరునెలల క్రితం పెళ్లయింది. ఇద్దరూ పెళ్ళికి ముందు పెళ్లి చూపులకంటూ రెండు సార్లు కల్సుకున్నారు. ఆనంద్‌కి మృదులని చూసిన క్షణంలోనే నచ్చింది. అంతే. 'ఓ.... కే' అనేశాడు.

మృదుల మాత్రం ఆలోచనలో పడిపోయింది. ఎందుకంటే ఆనంద్ తన మనసుకి నచ్చినట్టూ వున్నాడు నచ్చనట్టూ వున్నాడు. తనభర్త యెలా వుండాలని కోరుకుందో అచ్చంగా అలానే వున్నాడు. పర్సనాలిటి అమ్మాయిలు ఇష్టపడేలా ఆరడుగుల పొడుగున్నాడు. రంగు తెలుపు. రింగుల క్రాపు కానీ కాస్త 'బొజ్జ' వుంది. యిన్‌షర్టువేసుకున్న టెరికాట్ షర్టులోనించి బానేకన్పిస్తోంది ఇది బొత్తిగానచ్చనిమృదుల.

"బాబోయ్ ఈ పెళ్ళికొడుకు నాకొద్దు" అనేసిందిఅన్నగారితో.

అన్నగారు యెగిరిపడ్డాడు ఈతరం ఆడపిల్లలని అందరినీ కలిపి ఛడమడాతిట్టాడు. ఆఖరున ఆయాసపడిపోతూ అన్నాడు

"ఈకాలం ఆడపిల్లలకి వాళ్ళకి యేం కావాలో వారికి తెలియదు. పెద్దలు చెప్పితే వినరు. సుందరస్వప్నాలలో తేలిపోవటం తప్ప నేలమీద నడిచేఆలోచనలే చేయరు" మృదుల ఆశ్చర్యంగా అన్నగారివైపు చూడ సాగింది. తనంటే ప్రాణం పెట్టే అన్న తల్లితండ్రులులేని తనని స్వంత కూతురిలా చూసుకునే అన్న తనకంటే నాలుగేళ్ళు మాత్రమే పెద్ద అయిన

అన్న ప్రేమాదోమా అంటూ అరుంధతిని అరపైస కట్నంఅక్కర లేకుండా పెళ్ళాడి ప్రాణంకంటే మిన్నగా చూసుకుంటూన్న అన్న యేదో నాలుగు తరాల వెనకబడివున్నవాడిలా మాట్లాడటం నిజంగా ఆశ్చర్యం కలిగించి ఆలోచిస్తూ వుండిపోయింది. చెల్లిముఖంలోని భావాలని చదివేసిన అన్న కోపాన్ని మింగి చిన్నగా నవ్వేశాడు.

“చూడమ్మా ఆనంద్ చాలామంచివాడు. ఎం.కాం చదివినవాడు బ్యాంక్ వుద్యోగం చేస్తూన్నవాడు. ముఖ్యంగా నీవంటేయిష్టం చూపినవాడు యితన్ని పెళ్ళాడితేనిజంగా సుఖపడతావు. ఆలోచించుకో. బ్యాంకు వుద్యోగస్తులందరికీ కాస్త ‘బొజ్జ’ వస్తుంది. నువ్వు పెళ్ళిఅయిన తర్వాత అతనిచేత ‘డైట్’ కంట్రోల్ చేయించావా ఆ బొజ్జ తగ్గిస్మార్టుగా తయారై పోతాడు. యేం....సరేనా”

“అయితే నా అభ్యంతరం లేదు. కానీ ఒక్కటే షరతు. అతను స్మార్టుగా కాకుంటే మాత్రం నేఇక్కడికి వచ్చేస్తాను. చస్తేవెళ్లను”

“సరె....సరె నీషరతుకి అంగీకరించాను”

అన్న తర్వాత మృదుల పెళ్ళికి లగ్నం నిశ్చయించాడు అన్నగారు.

ఆనంద్ మృదులా వివాహం ధూంధాంగా అయిపోయింది.

అయితే మృదుల పెట్టిన షరతు విషయం ఆనంద్‌కి తెలియదు.

## 2

మొదటిరాత్రి. మృదుల అన్నగారూ వదినగారూ ఇంట్లోనే తమ బెడ్‌రూములో ఏర్పాటు చేయాలని ప్రయత్నం ప్రారంభిస్తూంటే మృదుల ముఖం వికారంగా పెట్టింది.

‘ఛీ పాడు’ అంది. ఆనంద్‌ముఖంలోకి చిరుకోపంగా చూస్తూ.

ఆనంద్‌కి మృదుల మనసులోని అభిప్రాయం అర్థం కాలేదు.

"ఏమిటి?" మెల్లగా అడిగాడు.

కళ్ళతో తన భావాన్ని చెప్పింది.

ఆనంద్ కళ్ళు పెట్టుకుని చూడసాగాడు, అర్థం కానివాడిలా.

ఒట్టి ట్యూబ్‌లైటు 'ఎం. కాం' ఎలా పాస్ అయ్యాడో ఖర్మ. విసుగ్గా ముఖం పెట్టింది. మృదుల.

అయినా ఆనంద్ అలాగే కూర్చుండి పోయాడు.

"ఆగది అన్నయ్యా వదినలది...." అంది యెలాగో.

యింక అర్థమైంది ఆనంద్‌కి.

"ఓ యిదేనా" అనేసి, మృదుల అన్నగారితో రెండు నిమిషాలు మాట్లాడి వచ్చి కూర్చున్నాడు

మృదుల ఆనంద్‌వైపు చూసింది.

ఆనంద్ కళ్ళు నవ్వుతున్నాయి. కానీ తనేం చేశాడో చెప్పలేదు.

రాత్రి యెనిమిది గంటల తర్వాత భోజనం చేసి వదినగారు పెట్టిన కొత్త తెల్లచీర కట్టుకుని నిలువుటద్దంలో చూసుకుంటూ నిలుచుంది మృదుల. వదిన కిలో మల్లెపూల దండతెచ్చి జడలో తురిమి తలతిప్పి ఆడబడుచు ముఖంలోకి కొంటెగా చూస్తూ నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు" చిరుకోపంగా అంది మృదుల.

"ఇక్కడైతే ఏ కిటికీ తలుపు సందుల్లో నుంచైనా చూస్తానేమో అని కదూ మా తమ్ముడిని తీసుకుని పారిపోతున్నావు"

"ఫో వదినా"

"నేనుకాదు. నువ్వేవెళ్ళు. మొదటిరాత్రి సంతోషాన్ని ఇద్దరూ నవ దంపతులూ పంచుకోండి.... మీదంపతులకి మాశుభాశీస్సులు. చూడు ఆనంద్ కొత్త గ్లాస్కోపంచా లాల్చీలో యెంత హూందాగా అందంగా వున్నాడో మృదులా నువ్వు అదృష్టవంతురాలివి చూడు నువ్వు కాస్త పెంకెదానివని అతనికి ముందే చెప్పానులే. కానీ అతని దగ్గర పెంకెతనం చేయకు. ఒకర్ని ఒకరుఅర్ధం చేసుకోవల్సిన రోజు యిది. వెళ్లు, అతను నీకోసం యెదురుచూస్తూన్నాడు. మీ అన్నయ్య ఆటో తెచ్చి వాకిట్లో, నిలుచున్నారు వెళ్లు"

"వెళ్లువెళ్లు అంటూన్నావు కానీ యిప్పుడు యెక్కడికి వెళ్లాలి"

వదినగారు బుగ్గన వేలుంచుకుని ఆడబడుచు కళ్ళల్లోకి చూసింది.

ఏం తెలియని నంగనాచివికదూ! అందుకే

"మృదులా రండి త్వరగా" అన్నగారి పిలుపు దగ్గరగా విన్పించి వదిన మాటని మింగేసి ఆడబడుచు చెయ్యి పట్టుకుని తీసుకువచ్చి ఆనంద్‌కి అప్పగించింది.

ఆనంద్ మృదులా వాకిట్లోకి వచ్చి ఆటోలో కూర్చున్నారు.

'వెళ్ళివస్తాం' అంటూన్న ఆనంద్ ముఖం కాస్త యెర్రబడటం మృదుల చూసింది. తను తల వంచేసుకుని చేతులకివున్న రంగు రంగుల గాజులని చూసుకుంటూ కూర్చుంది.

ఆటో హూటల్ ముందు ఆగింది.

'ఈ ట్యూబులైటికి తెలివి వుందేకాస్త' అనుకొంది మృదుల.

'మృదూ' మధురంగా వుందా పిలుపు. ఆమె మనసు గమ్మత్తుగా స్పందించసాగింది మృదులని చెయ్యిపట్టుకుని నడిపించుకుని రెండో అంతస్తులోని తనుబుక్ చేసిన రూములోకి తీసుకువెళ్ళాడు ఆనంద్.

# 3

ఆనంద్ పెళ్ళి అయిన తర్వాత వేరింటి కాపురం కోసం ఇల్లు వెతగ్గా ఆఖరికి ఓ మూడు గదులవాటా దొరికింది. మృదులకి చూపించాడు. బెడ్‌రూము బాగుందికానీ కిచెన్ నచ్చలేదు. అంటూనే సణుగుతూ సరేనంది.

అంతే ఆనంద్ ఇంటికి అడ్వాన్సు ఇచ్చేసి 'అమ్మయ్య' అనుకున్నాడు. పెళ్ళి అయిన ఈ మూడు నెలల నుంచీ తను పడినబాధ వర్ణనాతీతం. మృదుల అన్నవదినల దగ్గరే వుండి పోవడం ఆమెకోసం తనురోజూ వెళ్ళాలని అనుకోవటం అలావెడితే వాళ్ళు ఏమైనా అనుకుంటారన్న సంకోచం. అలాఅని వెళ్లకుండా వుండలేక పోవటం వేరే ఇల్లు దొరక్క పోవటం చాలా విసుగుచెందాడు. ఇల్లు కుదిరింది. మనసు తేలిక పడింది.

అన్న వదినలు యిచ్చిన సామాను ప్రస్తుతం సంసారానికి సరీ పడవుంది. మృదుల ఇంటిని నీట్‌గా సర్దింది. బెడ్‌రూముని మరీ చక్కగా వుంచింది.

డెకోలమ్ మంచాలూ పరుపులూ దోమ తెరలూ ఓచిన్న టేబిల్ దాని మీద వైట్‌క్లాతూ రాధాకృష్ణుల బొమ్మా అగరవత్తుల స్టాండూ, గాజు కుజాలో గులాబీలు రూములోకి అడుగు పెట్టగానే మనసుకి ఆనందంగా హాయిగా అన్పించింది ఆనంద్‌కి.

భార్యాభర్త లిద్దరూ భోజనం చేశారు. మృదుల, రవిశంకర్ సితార్ టేపు పెట్టివచ్చి కూర్చుంది. తెల్లచీరా తెల్లజాకెట్ తలలో లిల్లీపూల దండా మృదుల లైట్ వెలుగులో మెరిసిపోతూ వుంది.

ఆనంద్ మృదులనే చూడసాగాడు.

"ఏంటలా కొత్తవాళ్ళని చూసినట్లుగా" మృదుల ఆనంద్ ఒడిలో వాలిపోయింది.

"రోజు రోజుకి ఇంకా ఇంకా కొత్తకొత్తగా కన్పిస్తున్నావు"

"మృదూ" ఆనంద్ మృదులని గుండెకి హత్తుకున్నాడు. మృదుల అతని గుండె దగ్గర గువ్వలా ఒదిగిపోయింది.

వీధిగది వాకిలి దబదబా బాదుతున్న చప్పుడుకి ఆనంద్ ఆనందపు అంచుల్లోకి వెళ్ళబోతూన్న మనసు ప్రస్తుతానికి వచ్చేసింది.

"ఎవరు. ఈసమయంలో' యిద్దరి కళ్ళలోనూ విసుగూ కోపం.

ఆనంద్ వెళ్ళి తలుపు తెరిచాడు,

అంతే అతని రెండో అక్కా బావా వారి ఆరుగురు సంతానం బెల బెల్లాడుతూ లోపలికి వచ్చేశారు.

నువ్వు కొత్తకాపురం పెట్టావని తెల్సి నాలుగురోజులు వుండి పోదామని తిరుపతి నించి వెడుతూ ఈ హైదరాబాద్ కూడా చూసిపోదాం అని వచ్చాంరా తమ్ముడూ. ఆ పల్లెటూరుపాతకొంపా ఈదిక్కుమాలిన పిల్లలూ నా ప్రాణానికి పిసరంప సుఖం లేదనుకో. ఔనౌ మేం భోజనం చేయలేదు. మరదలిని వంట చేయమని చెప్పమరి'' అక్కగారు అయాస పడుతూ కుర్చీలోకూలబడింది.

"ఆనంద్‌కు మనసులో మండింది. అక్క వచ్చినందుకుకాదు. ఈ సమయంలోనే రావాలా' అని.

మృదుల వంటచేసేసరికి అడబడుచు పిల్లలు ఆరుగురూ తమ మంచాలెక్క గెంతుతూ అడి అడి అస్తవ్యస్తంగా పడి నిద్రపోయారు.

తెల్లటి బొంబేడయింగ్ దుప్పట్లు ఆపిల్లల కాళ్ళ కిందపడి నలిగి పోతూంటే ఆనంద్ మనసు విలవిల్లాడి పోసాగింది. పైకి యేం అనలేదు. అలా అని నోరుమూసుకుని వూరుకోలేదు.

అక్కగారంటే ఆనంద్‌కి చాలా అభిమానం. కానీ పిల్లలని క్రమ

శిక్షలో పెంచలేని ఆవిడ సోమరితనంపై తగనికోపం. ఇంక బావగారు వంట గదిలో చేరి పీటవాల్చుకుని కూర్చున్నాడు.

"చెల్లాయ్ ఏం చేస్తున్నావమ్మా కూరలూ. చూడూ కాస్త పప్పు పులుసు పెట్టు. అలాగే వడియాలు వేయించు. కాస్త ఆవకాయీ అవీ వున్నాయిగా. వుండకుండా యెలా వుంటుందిలే. కొత్తకాపురంకదా! మీ వదిన అన్నీ యిచ్చి పంపే వుండాలి. అన్నట్లు స్నానం చేయాలమ్మ చన్నీళ్ళు పోసుకోలేను కాసిన్ని వేడినీళ్ల పడెయ్యి. పాపం మేంసీకు అనుకోని అతిథులం పోనీ నీలడబడుచు కాస్త నీకు సాయమన్నా రాదు. రాలేదు. ఈ పిల్లలు పుట్టకముందు యెంత హుషారుగా వుండేదో. వీళ్ల పుట్టిన తర్వాత ఒట్టి రోగిష్టిది అయిపోయింది. ఏం చెయ్యాను యిదంతానా ఖర్మ.

మృదుల యింక ఆయనస్తుతివినలేక—

"మీరు దయచేసి అలా ముందుగదిలోకి వెడతారా" అంది.

అంతే ఆయనకి కోపంవచ్చేసింది. అంతే వెళ్ళిపోయాడు.

"ఈ కాలం చదువుకున్న ఆడపిల్లలకి బొత్తిగా పెద్దవాళ్ళన్న గౌరవం లేదురా ఆనంద్" అన్నాడు కచ్చగా.

"ఏమైంది" అని అడగటానికి యిష్టం లేదు ఆనంద్‌కి. ఆయన ఆ విషయం వదలటం లేదు. ఇంతలో మృదుల భోజనం ఏర్పాటు చేసి తర్వాత మెల్లగా చెప్పింది.

"వదినగారూ మీపిల్లలకీ మీకు ముందు గదిలో పక్కలు వేశాను. వాళ్ళని తీసుకువెళ్ళి పడుకోబెట్టండి"

ఆవిడ రుసరుస లాడుతూనే పిల్లలని ఈడ్చుకు వెళ్ళింది.

'వాళ్లకి భోజనం పెట్టండి' అంటూ ప్లేటులో వడ్డించి తెచ్చింది మృదుల.

"ఒద్దు. లేపితే యింక ఈరోజుకి నన్ను పడుకోనీయరు. మధ్యాన్నం అంతా టిఫెన్లు చాలా తిన్నారు" మూతి మూడు వంకర్లు తిప్పింది.

మృదుల తమ బెడ్‌రూములోకి వచ్చింది. మధ్యగది తలుపు ఘడియ వేసింది. అంతే అక్కడే కిందపడివున్న దిళ్ళని ఆనంద్ మీదకి విసిరి కొట్టింది.

ఆమెకి విసుగు కోపం వుక్రోషం ఒక్కుమ్మడి వచ్చేశాయి.

పిల్లలు తొక్కిన బెడ్‌షీట్‌లు ఈడ్చికింద పారేసింది. ఆ బెడ్ షీట్లతోబాటు మంచం చివర వరకూ జరిగి వచ్చిన ఆనంద్ చివరికి యెలాగో పక్కకి జరిగి తప్పించుకున్నాడు.

"మృదులా'' అంటూయేదో చెప్పబోయాడు

''మాట్లాడొద్దు" కస్సుమంది మృదుల.

ఆనంద్‌కి మొదటి సారిగా కోపం వచ్చింది మృదుల మీద.

"అనుకోని అతిథులు రావటానికి నేను కారణం అయినట్లుగా ఏంటి ఆ కోపం....'' విసురుగా లేచి ఓ చాప తీసుకుని మెట్లగదిలోకి వెళ్లి పోయాడు.

ఆరాత్రి ఆ నవదంపతులకి శివరాత్రి జాగరణే అయింది.

## 4

యెంతో కష్టంమీద నాలుగు రోజులు గడిచినాయి.

అక్కకీ బావకి పిల్లలకీ హైదరాబాద్ అంతా తిప్పి చూపించాడు ఆనంద్. మృధులని యెక్కడికి రమ్మన్నా 'రాను' అనేస్తోంది కటువుగా.

"ఆనంద్ ఈ మరదలు వరసయిలావుందేమిటిరా" అడిగేసింది అక్కగారు.

"ఏంలేదక్కా. మృదుల మంచిదే" అనేశాడు.

"ఔను, నేనేపొరబడ్డానేమో! మనసు మంచిదైనా మాట కాస్త కటువేరా ఆనంద్. నా పిల్లలు అల్లరివాళ్ళే ఒప్పుకుంటాను. వాళ్ల అల్లరి వాళ్ల అయినంత మాత్రాన తను చికాకుపడటం చాలాబాధగా వుంది నాకు" ఆనంద్ అడకత్తెరలో పోకలా నలిగి పోతున్నాడు.

ఎవరికి చెప్పలేక పోతున్నాడు. ఒకవైపు భార్య. ఒకవైపు తన చిన్నప్పుడు యెంతో ఆత్మీయంగా చూసిన అక్క. తను చదువుకునే రోజుల్లో ప్రతి శలవులకీ అక్కదగ్గరికి పరుగుతీసేవాడు, మీగడ పెరుగూ వెన్న ముద్దలూ పెడుతూ రోజుకోరకం పిండివంట చేసి తినిపించేది. అప్పుడు అసలు తన అక్క యెంత ఆరోగ్యంగా యెంత హుషారుగా వుండేది. బావగారు నలుగురన్నదమ్ములూ కలిసివున్నప్పుడు ఇల్లు పాడి పంటలతో కళకళ లాడుతూండేది. వేరుపడి ఆస్తులు పంచుకునేసరికి తన బావ గారికి ఒక్క యెకరం పొలం పాతబడిన ఇల్లూ మాత్రమే వచ్చాయి. దూరదృష్టిలేని బావగారు.

అప్పటికే నలుగురు పిల్లల తండ్రి అయ్యాడు. ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలం అయిపోయింది. "ఇప్పుడెలా అనుకుంటూండగానే మరో యిద్దరు పిల్లలు పుట్టారురా ఆనంద్" అంటూ వాపోయే అక్కని చూస్తే జాలి ముంచు కొచ్చింది ఆనంద్‌కి.

అక్కకి తను సాయపడాలి. ఎలా! యెలా! ఆలోచించసాగాడు ఆనంద్. మరో రెండు రోజులు గడిచాయి.

"మేం వెళ్ళిపోతాం ఆనంద్" అన్నాడు బావగారు.

ఈ మాటవిన్న మృదుల "అమ్మయ్యా" అనుకుంది తేలిగ్గా గాలి పీలుస్తూ.

వెడుదురుగాని బావా కానీ మరో నాలుగు రోజులు వుండాలి. ఎందుకంటే" అంటూన్న ఆనంద్ మాట విని మృదుల వంటగదిలో గిన్నెలు విసిరికొట్టి టక్కున పెట్టె సర్దేసుకుని విసవిసా ఇంట్లో నించివెళ్ళి పోతుంటే ఆనంద్ అర్థంకాకున్నా "మృదులా ఏమిటిది ఆగు, ఎక్కడికి బయలు

దేశావు'' అన్నాడు.

జవాబు చెప్పకుండా నిప్పులు కురిపిస్తున్నట్లుగా చూసి చకచకా నడిచి వెళ్ళి దారిన పోతూన్న ఆటో ఆపి యెక్కేసింది.

ఆనంద్ అక్కా బావా తెగ బాధపడి పోయారు.

''ఇదేంటిరా తమ్ముడూ'' వెక్కిళ్లు పెట్టింది.

''ఆనంద్ మేం వెళ్ళిపోతాం బాబూ'' అన్నాడు బావ.

"మీరు బాధపడకండి" అన్నాడు శాంతంగా ఆనంద్.

# 5

"ఏమిటీ యిలా పెట్టాబేడా సర్దుకువచ్చేశావు" నిలదీశాడు మృదుల అన్నగారు. వదినగారు అడిగింది యెవరికి జవాబు చెప్పలేదు మృదుల.

"అసలేమైంది! ఆనంద్‌కి బొజ్జతగ్గలేదని వచ్చేశావా!" అనుమానంగా చూస్తూ అడిగాడు.

ఒక్కక్షణం ఆలోచించి ఆ విషయం అసలు గుర్తేలేదు అన్నట్లుగా చూసింది.

వదినగార్కి చచ్చేంత నవ్వు వచ్చింది. అయినా పైకినవ్వలేదు! "ఏమైంది చెప్తావా నీ పెట్టె విసిరి బైట పారేయనా అరిచాడు". అన్నగారు.

అన్నగార్కి అనంద్ అంటే బోలెడంత గౌరవం. అతన్ని కాదని వచ్చిన తన్ని ఇంట్లోంచి గెంటినా పెట్టె గిరాట్టుకొట్టినా ఆశ్చర్యపోనక్కర లేదు కనుక జరిగింది చెప్పక తప్పదు అనుకుని ఎలాగో చెప్పేసింది.

అన్నా వదినా విషయం అంతా పూర్తిగా విన్నారు.

"యింత చిన్న విషయానికి యిలా వచ్చేశావా?"

ఇద్దరూ ఒకేసారి ఆశ్చర్యంగా అన్నారు. మృదులకి తిక్క రేగింది.

"యిది చిన్న విషయమా!" అంటూ ఆడబడుచుపిల్లలు చేసే అల్లరిని ఏకరువు పెడుతూ తన అసహ్యాన్ని వ్యక్తంగ చేస్తుంటే అన్న గారు గట్టిగా అరిచాడు. "నోరుముయ్. మీ వదిన కాపురానికి వచ్చేసరికి నువ్వు యెలా వున్నావ్! ఎంత గారాంపోయేదానివి యెంత పెంకెతనం చేసేదానివి తను విసుక్కుని నిన్ను సరిగా చూడకుంటే ఏమైపోయిండే దానివి. చాలా పొరపాటు పని చేశావు"

విసురుగా బైటకి వెళ్ళిపోయాడు.

వారం గడిచింది. ఆనంద్ తన కోసం వస్తాడని యెదురు చూసింది. కానీ అతనురాలేదు అన్నావదినా వెళ్ళిపొమ్మని పోరసాగారు. ఆనంద్ రాడని రూఢి చేసుకుని తనేబయలుదేరి ఇంటికి వచ్చింది మృదుల. ఇల్లు తాళం వేసివుంది. మృదులని చూస్తునే పక్కవాటాలోని పాప తాళం చెవి తెచ్చి యిస్తూ.

"అంటీ అంకుల్ బ్యాంకుకు వెడుతూ రోజూ 'లాక్' మాకిచ్చి వెడుతూన్నారు మీరు వస్తారేమోనని. మీరిన్నాళ్ళున్నారేం" అంది

"మా ఆడబడుచు వాళ్ళు ఎప్పుడెళ్లారు".

"నాలుగు రోజులైపోయిందిగా" అంటూనే ఆ పాప వెళ్ళిపోయింది.

తాళం తీసుకుని లోపలికి వస్తుండే పోస్టుమేను పడేసిన కవరు కనిపించి చేతిలోకి తీసుకుని చించి చదవసాగింది.

"డియర్ ఆనంద్

నేనూ మీ అక్కా పిల్లలు ఇక్కడికి క్షేమంగా చేరుకున్నాం నువ్వు మావల్ల అశాంతిపాలు అయ్యా మా భవిష్యత్ ఆలోచించి సంతానానికి 'ఫుల్ స్టాప్' పెట్టించి ఇప్పుడు కొన్నాళ్ళు బాధపడినా భవిష్యత్‌లో బంగారు

కాలం వుంటుంది అనే ఆశకల్గించి మాలో నూతనోత్సాహాన్ని కల్గించావు యిందుకు నీకు మరీ మరీ కృతజ్ఞతలు తెల్పుకుంటూ చెల్లాయికి ఆశీస్సులు చెప్తున్నాను. మీ కొత్త కాపురంలోకి అనుకోని అతిధులుగా కాలుపెట్టి మీకు అశాంతి కల్గించినందుకు నేనూ మీఅక్కా మరీమరీ బాధపడుతూ అలా యెప్పుడూ యెవరినీ రావద్దనీ మేం రామనీ మాటయిస్తు మీ వీలు వెంబడి మా ఇంటికే అతిధులుగా రమ్మని ఆహ్వానిస్తున్నాను.

ఇట్లు

మీ బావ"

ఆ వుత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదువుకున్న మృదులకి తన తప్పు తనకి తెలిసింది.

"యెంత పొరబాటు చేశాను" మనస్ఫూర్తిగా పశ్చాత్తాప పడి పోయింది సాయం కాలం భర్తరాగానే క్షమించమని అడగాలని అనుకుంది చకచకా ఇల్లంతా నీట్‌గా సర్దింది. మంచాలమీద ఇస్త్రీ దుప్పట్లుపరచి స్నానం చేసి తెల్లచీరె కట్టుకుని జడలో సన్నజాజులు తురుముకుంది. పక్కమీద విచ్చిన సన్నజాజులు చల్లింది. ఆనంద్ కోసం యెదురుచూడ సాగింది.

ఆనంద్ రాత్రి తొమ్మిది గంటలకిగానీ ఇల్లు చేరలేదు. చేరిన తర్వాత ఆశ్చర్యపోతూ లోపలికి వచ్చాడు. తను వూహించినట్లుగా మృదుల కొరకొరలాడుతూ లేదు. అపర రతీదేవిలా విద్యుద్దీపపు వెలుగులో మెరిసి పోతూ వుంది కన్నార్పకుండా భార్యని చూడసాగాడు.

మృదుల మొదట భయంగా తర్వాత బెరుగ్గా ఆ తర్వాత పది రోజుల యెడబాటు వల్ల కల్గిన బాధగా ఆ తర్వాత అతనంటే వున్న ప్రేమగా అభిమానంగా ఆత్మీయంగా ఒక్కోఅడుగూవేస్తు దగ్గరగా వచ్చి అమాంతం వాటేసుకుని అతని ఛాతీమీద ముఖంవుంచి.

"ఆనంద్ ... నన్ను క్షమించు.... నన్ను క్షమించు" అనేయసాగింది.

ఆనంద్‌కి మృదులమాట విన్పించటం లేదు. తన శరీరంలో శరీరంలా ప్రాణంలో ప్రాణంలా ఐక్యమైపోయిన ఈ మృదుల అసలు తనని వదిలి యెలా వెళ్ళింది! వెళ్ళింది! యెలావుంది! ఆశ్చర్యం. అయినా తిరిగి తనదగ్గరికి వచ్చేసింది. చాలు. యిదిచాలు మృదులకి తనంటే యెంత ప్రేమో తెల్సుకోవటానికి.

అతని మనసు అతితేలికై ఏ లోకాల్లోకో తేలిపోతూ వుంది మృదుల స్థితీ డిటో.

"ఆనంద్ ఆరు నెలల క్రితం వరకూ నువ్వంటే యెవరో నాకు తెలియదు కానీ యిప్పుడు నాజీవితాన్ని యెంత ఆక్రమించావు. వివాహ బంధంలోని పవిత్ర ప్రేమ అంటే యిదేనా గొణుక్కోసాగింది మృదుల.

స్వాతి సపరివార పత్రిక 17-1-86